ఎం.డి.ఎం. మహిళ కార్మికుల సమస్యలు సాధనకై ఛలో విజయవాడ

విశాలాంధ్ర-చోడవరం : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఎండి ఎం మహిళా కార్మికుల సమస్యల సాధనకై ఈ నెల 18న విజయవాడలో జరుగు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కుకింగ్ కాస్ట్ పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని, స్కూల్ విలీనం పేరుతో తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ మహిళ కార్మికులను, అనుబంధ ప్రజా, మహిళ సంఘాలను వారు కోరారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్చి 15వ తేదీ శనివారం నిర్వహించే శుభ్రత కార్యక్రమాలపై గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి, డివిజను, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పై పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆవిష్కరించారు.

స్వయం రక్షణపై అవగాహన కలగాలి : ఎస్సై ఏ.విభూషణరావు

విశాలాంధ్ర-యస్.రాయవరం : తమకు తాము స్వయంగా రక్షణ కలిగే విధంగా అవగాహన చేసుకోవాలని ఎస్సై ఏ.విభూషణ రావు అన్నారు. గురువారం మండలంలో తిమ్మాపురం గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు స్వయంగా రక్షించుకుంటే విధంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా చందు టైక్వాండో ఇనిస్టూట్ నుంచి ఇద్దరు నిపుణులతో విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. వారు ఇచ్చిన శిక్షణలో ఎక్కడైనా తమకు ప్రమాదం ఉందని గుర్తించినప్పుడు స్వయంగా ఎదుట వ్యక్తులపై చేసే పోరాటం గురించి నమూనా చేసి చూపించారు. ప్రతి బాలికల పాఠశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ

విశాలాంధ్ర-యలమంచిలి/అచ్యుతాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ, న్యాయశాఖ మంత్రి ఎండి ఫరూక్‌ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ నియోజవర్గం వలు సమస్యలపై చర్చించడం జరిగిందని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్ ఉద్యోగ అవకాశాలపై సదస్సు

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 3వ సంవత్సరం చదువుతున్నటువంటి డిగ్రీ కళాశాల విద్యార్థులకు, నిర్మాణ్ భారత్ మరియు టెక్ మహేంద్ర ఫౌండేషన్, స్మార్ట్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ విశాఖపట్నంవారి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి సీతాలక్ష్మి తెలిపారు. విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ కల్పన కొరకు కావలసినటువంటి సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహనతో పాటు, సాఫ్ట్వేర్ రంగంలో గల ఉద్యోగ అవకాశాలపై దుర్గాప్రసాద్ వెలమల ప్రోగ్రాం మేనేజర్ వివరించారు. ఈ కార్యక్రమం లో ఒకేషనల్ ట్రైనీ మొబైలజలర్ దుర్గా ప్రసాద్, కళాశాల కెమిస్ట్ అధ్యాపకులు డాక్టర్ వి.వి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన వైసీపీ నాయకుడిని మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-నాతవరం : నాతవరం మండలం మాధవనగరం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు సిద్దాబత్తుల వెంకటరమణ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆసుపత్రి నుండి చికిత్స పొంది రాగా, గురువారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ స్వయంగా వెళ్లి పరామర్శించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జడ్పీటీసి కాపారపు అప్పలనరస, మండల పార్టీ ప్రెసిడెంట్ లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, యువజన విభాగం అధ్యక్షుడు బందారు నాయుడు, పలువురు సర్పంచులు ఉన్నారు.

కోటి రూపాయలతో కళ్యాణమండపం నిర్మాణం

విశాలాంధ్ర-కే కోటపాడు : మండల కేంద్రం కే కోటపాడులో కోటి రూపాయలు వెచ్చించి కళ్యాణ మండప నిర్మాణం చేపట్టనున్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ గోపాల్ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వి.ఎం.ఆర్.డి.ఏ అధికారులు స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు అనుకుని గతంలో ఆసుపత్రి ఏర్పాటుకు గ్రామస్తులు అర ఎకరం స్థలం కొనుగోలు చేశారు. అప్పట్లో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి ఈ స్థలం అనుకూలంగా లేదని ఆ స్థలాన్ని విడిచిపెట్టారు. ఆ స్థలం నేటి వరకు ఖాళీగా ఉంది. అక్కడే వి ఎం ఆర్డీఏ నిధులతో ఆధునిక కళ్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ వి ఎం ఆర్ డి ఏ చైర్మన్ ప్రణవ భాస్కర్ సహకారంతో నియోజకవర్గంలో అనేక పనులు చేపడతామని అన్నారు. ముఖ్యంగా కే కోటపాడు నుండి చీడికాడ మండలం వాకపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ వీఎమ్ఆర్డీఏ కమిషనర్ పరిశీలన చేపట్టడం జరిగిందన్నారు. ఈ రోడ్డు గుండా అనేక గ్రామాల ప్రజలు రైతులు విశాఖ నగరానికి కూరగాయలు ఇతర నిత్యావసర వస్తువులు రవాణా చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అడిగిన వెంటనే కళ్యాణ మండపానికి నిధులు కేటాయించిన వీఎమ్మార్డీఏ చైర్మన్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. వీరి వెంట వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి వి జి కుమార్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్ , చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ , సూపరిండెంట్ ఇంజనీర్ భవాని శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, మాజీ సర్పంచ్ దోకల లక్ష్మీనరసింహమూర్తి స్థానిక తెలుగుదేశం నాయకులు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-పరవాడ : ఏపీఈపిడిసిఎల్ సంస్థ పర్యవేక్షణలో కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం పరవాడలో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ సమస్యల పరిష్కార కార్యక్రమంలో చైర్ పర్సన్ (రిటైర్డ్ జడ్జి) డాక్టర్ బి. సత్యనారాయణకు గొర్లివానిపాలెం ఒకటో వార్డులోని విద్యుత్ వినియోగదారులు వినతి పత్రం సమర్పించారు. కశింకోట సబ్ డివిజన్ పరవాడ సెక్షన్ కార్యాలయం పరిధి గొర్లివానిపాలెంలో విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న హెచ్చు తగ్గులు కారణంగా గృహోపకరణాలకు జరుగుతున్న నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం నడుస్తున్న సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్ కు అదనంగా రెండు ఫేసుల విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇప్పించాలని విన్నవించారు. ఈ సమస్యపై అనేక సార్లు అధికారులదృష్టికి తీసుకెళ్ళినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. తమ అభ్యర్ధనను పరిశీలించి విద్యుత్ వినియోగదారుల గృహోపకరణాలకు జరుగుచున్న నష్టాన్ని నివారించుటకు సంబంధిత అధికారుల వారికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిప్పాడ రామారావు, టి. గోవిందరావు, పి.అప్పారావు, సి.హెచ్.అప్పారావు, పి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

మార్చి 17వ తేదీ నుండి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర-మాకవరపాలెం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను ఈ సంవత్సరం మాకవరపాలెం మండలంలో రెండు కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాకవరపాలెం మరియు కృపా కమల్ హై స్కూల్ మాకవరపాలెంలలో నిర్వహించడం జరిగుతుంది అని ఎంఈఓ-2 పి ఎస్ ఎన్ మూర్తి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాకవరపాలెంలో రెగ్యులర్ అభ్యర్థులు 258 మంది ప్రైవేట్ అభ్యర్థులు 30 మంది హాజరుకానున్నారు. అదేవిధంగా కృపా కమల్ ఉన్నత పాఠశాలలో రెగ్యులర్ అభ్యర్థులు 201 , ప్రైవేట్ అభ్యర్థులు 31 మంది హాజరు కానున్నారు. మొత్తం మండలంలో 520 మంది పదవ తరగతి విద్యార్థులు హాజరవుతున్న ఈ పరీక్షలు మార్చి 17వ తేదీ నుండి అనగా సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు జరుగు ఈ పరీక్షల కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయడమైనది. ఈపబ్లిక్ పరీక్షల రోజు విడిచి రోజున నిర్వహించబడును అనగా ప్రతి పరీక్షకు కనీసం ఒకరోజు గ్యాప్ ఉండును. దీనివలన విద్యార్థులు పరీక్షలను మరింత సమర్థవంతంగా రాయగలుగుతారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాకవరపాలెం రిక్షా కేంద్రానికి బి అచ్యుతరామయ్య, కృపా కమల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి శ్రీనివాసమూర్తి చీఫ్ సూపరిండెంట్స్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, లైట్స్, ఫ్యాన్స్ మరియు కట్టుకట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షా కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ విధించబోతున్నారు అని అన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే మహిళలు మహారాణులు

మహిళల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం ముందడుగు

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు తెలుగు మహిళల కృతజ్ఞతలు

విశాలాంధ్ర-మునగపాక: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి, మహిళల అభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి లోకేష్‌కు తెలుగు మహిళల తరపున తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మండల కేంద్రమైన మునగపాక టీడీపీ కార్యాలయంలో సమావేశంలో మంజు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని లక్షా 50వేల మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇప్పించి,అనంతరం వారికి కుట్టు మిషన్లు ఉచితంగా ఇవ్వడం,అమహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం,చేనేత మహిళలకు ఉచితం నూలు సరఫరా చేస్తామని ఇలా అనేక పథకాలు సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యతనిచ్చే ఘనత దక్కుతుందన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఆడారి జానకి,మహిళా నాయకురాళ్లు నారాయణమ్మ, పెంటకోట స్వాతి,లోక సత్యవతి, భవానీ, అప్పలనర్సమ్మ,నూకరత్నం, ఆదిలక్ష్మి, జనసేన మహిళా అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన బ్రాండిక్స్ దొరస్వామి

విశాలాంధ్ర-అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ భారతీయ భాగస్వామి దొరస్వామి సీఎం చంద్రబాబునాయుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దొరస్వామి బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సంస్థ అపెరల్, వస్త్ర పరిశ్రమ రంగంలో సాధించిన ప్రగతి విశేషాలు, గ్రామీణ మహిళలు, యువతకు కల్పించిన ఉపాధి భవిష్యత్తు ప్రణాళికలను సీఎంకు తెలిపారు. బ్రాండిక్స్ గా వున్న సంస్థ పేరును అధిష్ఠాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్కుగా మార్చినట్టు, సంస్థ లక్ష్యాలను పేర్కొన్నారు. అధిష్ఠాన్ పేరు మార్పుతో అపెరల్, వస్త్ర పరిశ్రమలతో పాటు నూతనంగా ఫార్మా, మాన్యుఫాక్చరింగ్ వంటి ఎన్నో రంగాల పరిశ్రమలు ఈ ఇండస్ట్రియల్ పార్కులో విస్తరించే ప్రణాళికల గురించి తెలియజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ, సహకారం కావాల్సినా అందిస్తామని, మరొక 20 వేల మందికి ఉపాధి కల్పించే దిశగా చర్యలను వేగవంతం చేయాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొరస్వామి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీ.సీ రోడ్ల పేరుతో టి.డి.పి. నేతల దందా

విశాలాంధ్ర-చోడవరం : చోడవరంలోని ఖాళీ స్థలాల్లో సీ.సీ. రోడ్లు వేస్తామంటూ టి.డి.పి. నేతలు కొందరు పలు దందాలకు పాల్పడుతున్నారని స్థానికులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నారు. స్థలం యజమాని దగ్గర పదివేల రూ.లు నుండి 20 వేలు పైగా వసూళ్లకు పాల్పడుతున్నారాని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. టిడిపి నాయకుల మాటలు వినని వారిని నానా చిత్ర హింస లకు గురి చేస్తూ పైశాచికంగా ప్రవర్తిస్తున్నారాని బాధితులు, మహిళలు చెబుతున్నారు. డబ్బులు చేతులు మారిన తరువాత వారి ఇష్టాను సారం అక్రమ లే అవుట్లు లో దర్జా గా సీ.సీ. రోడ్లు వేసుకుంటూ , పాపం గడుపుతున్నారని ఆరోపిస్తున్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ఫలితంగా రక్షణ గోడల నిర్మాణం

విశాలాంధ్ర-చోడవరం : భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో వంతెనలపై రక్షణ గోడలు నిర్మించాలంటూ చేసిన దశల వారి పోరాటాల ఫలితంగా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి నిర్మాణాలు చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలియజేశారు. మీడియాతో గురువారం కార్మిక నేత రెడ్డిపల్లి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో నిరంతరం చేసిన ప్రజా పోరాటాల ఫలితంగా ఆర్ అండ్ బి అధికారులు చోడవరం-అనకాపల్లి రోడ్డులో వెంకన్నపాలెం సాయిబాబా గుడి వద్ద ఇరుకు కాలువ పైన రక్షణ గోడలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రమాదాలు జరుగుతున్న సందర్భంలో ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ముట్టడి చేపట్టి, ఇరుకు మదుం లు, రక్షణ గోడలు లేక జరుగుతున్న ప్రమాదాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టి, రక్షణ గోడలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలియజేశారు. ఇరుకు మదుం, రక్షణ గోడలు లేక జరుగుతున్న ప్రమాదాలపై గతంలో పలుమార్లు నిరసనలు తెలిపి, అక్కడే నిరసన కార్యక్రమం చేపట్టిన గోవింద మాస్టారుకు కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న నిరసన కార్యక్రమందృష్టిలో పెట్టుకొని ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశామన్నారు. అధికారులు ఎట్టకేలకు స్పందించి, నేటికి రక్షణ గోడ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రోడ్డుకి ఇరువైపులా హెచ్చరిక బోర్డులను మరియు స్పీడ్ బ్రేకర్లను కూడా వేయాలి అని, నిర్మాణాన్ని పర్యవేక్షించి, హెచ్చరిక బోర్డులు, స్పీ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదాలను నివారించడానికి సహకరిస్తున్న ఆర్ అండ్ బి అధికారులు చేపట్టిన చర్యలకు భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున, ప్రజల తరఫున అధికారులకు కార్మిక నేత రెడ్డిపల్లి కృతజ్ఞతలు తెలియజేశారు.

జీడిపిక్కల మద్ధతు ధర కోసం గిరిజన రైతులు ఆందోళన

విశాలాంధ్ర-దేవరాపల్లి : జీడీ పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని ఈనెల 24.,25 తేదీలో జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాలు వద్ద అందోళన చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న మండల కార్యదర్శి బిటి దోర పేర్కొన్నారు. దేవరాపల్లి మండలం గర్సింగి పంచాయతీ లో నాలుగు గిరిజన గ్రామాలకు చేందిన గిరిజన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జీడి పిక్కల మద్దతుధర కేజీ పిక్కలకు కే.రూ.200/-లు ఇవ్వాలని ఆర్.బి.కె.ల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వరి,చెరకు, పత్తి మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని. కాని జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు మార్కెట్ సౌకర్యం కల్పించక పోవడం ధర కూడా నిలకడగా ఉండక పోవడం జీడిపిక్కల పంట సమయంలో వ్యాపారులు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని, వ్యాపారుల చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత ఆమాంతంగా జీడి ధర పెరుగుపోతుందన్నారు.రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేసారు.జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగా నిర్ణయించి అమలుచేయక పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారని తెలిపారు.ప్రస్తుతం 80 కేజీల జీడి పిక్కల బస్తాకు వ్యాపారులు రూ. 8,000/-మాత్రమే చెల్లిస్తున్నారని దీంతో జీడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురి అవుతున్నారని అన్నారు. మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు మన దేశంలో జీడి సాగులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 70 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారని సుమారు 80వేల మందికి పైగా రైతులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. జీడి రైతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి.జీడి పిక్కల గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో అదికసంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు శ్రీదేవి తనిఖీ

విశాలాంధ్ర-నక్కపల్లి : మండలంలో నక్కపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాల లాగా జిల్లాలో అన్నిచోట్ల ఉంటే ఎంతో బాగుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ల ఆశయం నెరవేరుతుందని అంటూ నక్కపల్లి కేజీబీవీ పాఠశాల లో పిల్లలకి తయారుచేసిన భోజన పదార్థాలను రుచి చూసి అక్కడ విధి నిర్వహణ లో ఉన్న ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ సలీమా పనితీరు లను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి. శ్రీదేవి అభినందిస్తూ కితాబిచ్చారు. అనకాపల్లి జిల్లాలో రెండు రోజులుగా వివిధ ప్రభుత్వ పాఠశాలలను హాస్టల్స్ పరిశీలిస్తూ అక్కడ విద్యార్థులకు తయారుచేస్తున్న భోజనాన్ని రుచి చూసి నిర్వహకులకు పలు సూచనలు చేస్తూ ముందుకు సాగారు. అందులో భాగంగా గురువారం నక్కపల్లి కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా కమిషనర్ సభ్యురాలు శ్రీదేవి తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వండిపెట్టిన భోజన పదార్థాలను ఆమె రుచి చూసి ఇంత రుచికరంగా వండి పెడుతున్నారా అంటూ ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలకు ఈ విధంగా భోజనం తయారు చేయడంలో ఉన్న సంతృప్తి ఇందులో ఉండదని ఇది మంచి గా సంతృప్తిని కలిగిస్తుందని, భోజనం పెట్టే విషయంలో ఏ ఒక్కరు కూడా రాజీ పడవద్దు అని కడుపునిండా పిల్లలకు భోజనం పెట్టాలని చెప్పారు. అనంతరం పిల్లలతో ముఖాముఖిగా మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా మెనూ అమలు చేస్తుందో ఆ విధంగా భోజనం పెడుతున్నారా అంటూ పిల్లలతో మాట్లాడినప్పుడు వారి నుంచి వచ్చిన సమాధానం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ విధంగా బాధ్యత కలిగి సిబ్బంది పనిచేయడం మంచి విశేషమని అన్నారు. ప్రిన్సిపల్ సలీమా, వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి తో పాటు మిగతా ఉపాధ్యాయులందరినీ అభినందించారు. ఈ పాఠశాలల జిల్లాలో అన్ని పాఠశాలలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అనుకున్నది జరిగి తీరుతుందని అన్నారు. పదో తరగతి పిల్లలకు మంచి ఫలితాలు తీసుకురావాలని ఆశీర్వదించారు పిల్లలకు ఎంత మంచి భోజనం పదార్థాలను తయారు చేస్తున్న వంట సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మరోసారి ఈ పాఠశాలను పరిశీలిస్తానని, రాష్ట్ర కమిషన్ చైర్మన్ కూడా తీసుకొస్తానని ఒక రోజంతా పిల్లలతో గడుపుతానని సభ్యురాలు శ్రీదేవి చెప్పారు. ఆమెతోపాటు జి సి డి ఓ ఎంఈఓ లు డివిడి ప్రసాద్, నరేష్, అరుణ్ కుమార్ ,వేమగిరి నూకరాజు, ఆహార భద్రత సిబ్బంది ఉన్నారు.

104 ఉచిత వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి

గ్రామ ఉప సర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర

విశాలాంధ్ర-మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో 104 వాహనాలు ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని,గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ఉప సర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర కోరారు.మండలంలో మూలపేట పంచాయతీ గంగాదేవిపేట గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలో అవసరమైన వారందరికీ షుగరు,బీపీ,ఇతర వ్యాధులకు సంబంధించిన మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో యామిని,ఏఎన్ఎం రమణి,మెడికల్ సిబ్బంది,ఆశ వర్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహన ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-చోడవరం : మండలంలోని

అడ్డూరు శివారు లో బుధవారం రాత్రి జరిగిన ఓ వాహన ప్రమాదంలో ఆటో డ్రైవర్ డి. నరసింగరావు (54)అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు వివరాల్లోకి వెళితే సబ్బవరం మండలం ఆరిపాక నుండి వెంకన్నపాలెం వైపు వస్తున్న ఖాళీ ఆటో వస్తుండగా అడ్డూరి శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్ను ఎంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు దీనిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవుడు చెరువు గెడ్డ, వాగు ఆక్రమణను వెంటనే తొలగించాలి

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని దేవుడు చెరువు నకు నీరు ప్రవహించే గెడ్డవాగు ఆక్రమణ ను తొలగించాలని సబ్బవరం మేజర్ పంచాయతీ ఒకటో వార్డు మెంబర్ కొల్లి దేవుడమ్మ సబ్బవరం పంచాయతీ ఈవో కె శ్రీనివాసరావు కు గురువారం వినతిపత్రం అందజేశారు. సర్వేనెంబర్ 271 నుండి దేవుడు చెరువుకు నీరు ప్రవహించే గెడ్డ వాగును కొంతమంది ఆక్రమణ చేసి అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని, ఆ నిర్మాణాలకు పంచాయతీ నుండి ఎటువంటి అనుమతులుగాని, ఇంటి పనులు గాని ఇవ్వకుండా నిలిపి వేయాలని వినతిపత్రం లో పేర్కొన్నారు. ఈ గెడ్డ వాగు లోని ఆక్రమణలు తొలగించి దేవుడు చెరువు ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే దేవుడు చెరువు నీటి పరివాహ ప్రాంతాన్ని ఎటువంటి ఆటంకం లేకుండా కాపాడాలని, పరిరక్షించాలని కోరారు. ఇదిలా ఉండగా దేవుడి చెరువు గర్భం ఆక్రమణలకు గురైందని, దేవుడు చెరువులో కొంతమంది అక్రమంగా నిర్మాణాలు చేపట్టి, దేవుడి చెరువును దురాక్రమణ చేశారని, దేవుడు చెరువును కూడా సర్వే చేసి దేవుడు చెరువులో దురాక్రమణ లను తొలగించాలని పలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.ఈ కార్యక్రమం లో కొల్లి గంగు నాయుడు, కొల్లి అచ్చన్న, గొర్లి బంగారు నాయుడు, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివిధ బీసీ పథకాలకు దరఖాస్తులు ఆహ్వానం : ఎండిఓ

విశాలాంధ్ర-నక్కపల్లి : ప్రభుత్వం బీసీ వర్గాలకు చెందిన వివిధ విభాగాల్లో ఉన్న వారి కోసం స్వయం శక్తిలో ఆర్థికంగా బలపడేందుకు అవసరమైన రుణాలను వివిధ పథకాల ద్వారా అందిస్తుందని అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఎండిఓ దెందుకూరి సీతారామరాజు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు బీసీ కార్పొరేషన్ ద్వారా 146 స్కీములు ద్వారా 20 నుండి 60 సంవత్సరాల లోపు ఉన్నవారికి రుణాలు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు.ఈ నెల పదో తేదీ నుండి 22వ తేది వరకు ఆన్లైన్ ద్వారా లేదా గ్రామ సచివాలయాల ద్వారా ఈ రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.ఈ స్వయం ఉపాధి పథకాలకు బీసీ,ఈబిసి, కమ్మ,రెడ్డి,ఆర్య వైశ్య, క్షత్రియ,బ్రాహ్మణ కాపు (ఓసీ-కాపు,బలిజ, తెలగ, ఒంటరి) మేదరి , కుమ్మరి శాలివాహన మొదలగు కులాల వారు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల సబ్సిడీ మంజూరు చేయుటకు గారు దరఖాస్తుదారులు ఏపీ-ఓబిఎంఎంఎస్ ద్వారా ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. సచివాలయంలో కాకుండా బయట ఎక్కడైనా దరఖాస్తు చేసినట్లయితే ఆ దరఖాస్తులను సంబంధిత సచివాలయాలకు అందజేయాలని చెప్పారు. నక్కపల్లి మండలానికి రెండు కోట్ల 2 లక్షల రూపాయల వరకు 107 యూనిట్లుగాను మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అర్హత కలిగిన వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుట్టుమిషన్ లకు సంబంధించిన అనుభవం కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఆయనతోపాటు సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మూర్తి ఉన్నారు.

కన్నులు పండుగగా శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం

విశాలాంధ్ర-సబ్బవరం: ఉత్త రాంధ్ర జిల్లాల ఇల వేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న సబ్బవరం మండలం లోని అంతకాపల్లి పంచాయతీ లోని గ్రామ ప్రజలు ఆరాధ్య దైవమైన, శ్రీ ముత్యాలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో కన్నులు పండుగగా జరిగింది. ఈ అమ్మవారు స్వతహాగా బ్రాహ్మణ స్త్రీ కావడంతో పండుగ చాటిన దగ్గర్నుంచి మారువారం (పక్షం రోజులు వరకు మాసాహారం ముట్టరు. అనాదిగా వస్తున్న ఆచారం వెనుక 500 ఏళ్ల చరిత్ర ఉన్నరని భక్తులు చెబుతున్నారు. ఈ జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి తొలి వేల్పు సంద ర్భంగా అమ్మవారి ఘటాల తో పువ్వులు రథంతో, గుర్రాలతో, భారీ మందు గుండు సామాగ్రితో, కోలాటాలతో సతకంపాటు వద్ద వైభవంగా తొలి వేల్పు సంబరం జరిగింది. రాత్రి రెండు గంటలకు పౌరాణిక సంస్కృత కార్యక్రమాలు గయోపాఖ్యాసం, పత్య హరిశ్చంద్ర కాటిసీను రామాంజనేయ యుద్ధం సీను భక్తులను బాగా ఆకట్టు కున్నాయి.గురువారం అనుపు మహోత్సవం సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయితే అలయం వద్ద ఉన్న చెట్ల పైనుండి పాము రావడంతో భక్తులు ఒకసారి గా ఉలిక్కిపడ్డారు. కొందరు భక్తులు పాము అమ్మవారు రూపంలో వచ్చారంటూ నమస్కారాలు చేసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుండి అమ్మవారి ఘటాలతో పూల రథం, ఏలేనుగు, గుర్రాలతో, అంతరాపల్లి పంచాయతీలో పురవీధుల్లో ఊరేగిస్తూ అంగరంగ వైభవంగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సబ్బవరపు త్రినాధ రామకాను, సబ్బవరపు నారాయణమూర్తి , సబ్బవరపు ముత్యాలనాయుడు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, రోంగలి దేవుడు బాబు, సబ్బవరపు దేవుడు బాబు, సబ్బవరపు నరసింహమూర్తి, గొర్లి అప్పారావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం పోలీసు ఔట్ పోస్ట్

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-భోగాపురం : మండలంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణ పనులకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వర్కర్లు, స్థానిక ప్రజల మధ్య విభేదాలు తలెత్తకుండా ప్రజలకు పోలీసు సేవలు అందుబాటులో ఉండే విధంగా రెడ్డి కంచేరు గ్రామంలో పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేశామని గురువారం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. రెడ్డి కంచేరు గ్రామంలో నిర్మించిన పోలీసు ఔట్ పోస్టును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం నిమిత్తం వివిధ రాష్ట్రాల నుండి వర్కర్లు, టెక్నీషియన్స్ వచ్చారన్నారు. వీరికి అవసరమైన వస్తువులు కొనుగోలు నిమిత్తం రెడ్డి కంచేరు గ్రామంలోకి వెళ్ళే సమయంలో స్థానికంగా వాడే తెలుగు భాష రాక, స్థానికులతో గొడవలు జరిగేవన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గాను పోలీసు బీటు, పెట్రోలింగ్ తరుచూ నిర్వహించేవారమన్నారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశ్యంతో జీఎంఆర్, ఎల్ అండ్ టీ సహకారంతో పెట్రోలింగ్ వాహనం, పోలీసు ఔట్ పోస్టు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇకపై పోలీసుల సహకారం ఎప్పుడు అవసరమైన స్థానిక ప్రజలు, పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారు ఔట్ పోస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ వకుల్ జిందల్ కు జీఎంఆర్ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఔట్ పోస్టు ను, పెట్రోలింగ్ వాహనాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ గ్రూపు వైస్ ప్రెసిడెంట్ రామరాజు, సిడిఓ ఎం.కోటేశ్వరరావు, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ ఎన్.వి.ప్రభాకరరావు, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, ఎస్సై పాపారావు, స్థానిక ప్రజలు, జీఎంఆర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో ఘనంగా శ్రీ ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవం



విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యలమ్మ తల్లి పండుగ అణుపు మహోత్సవం సందర్భంగా గురువారం ఉదయం అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు ఆలయ ఉత్త కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ కో-అపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అలాగే పెందుర్తి నియోజవర్గం వైసీపీ నాయకులు గండి రవికుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారికి స్వాగతం పలికి ఘనంగా ఈ కార్యక్రమంలో యువ నాయకులు గండి వంశీ దీప్, మాజీ ఎంపీపీ గండి దేముడు, గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, దొడ్డి రాజు కోటి, దొడ్డి రాము, శిలపారాశెట్టి మాలినాయుడు, దాడి సూరిబాబు, కోరుబిల్లి సూకరాజ్, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుండెలాంటిదే కిడ్నీ : డాక్టర్ శ్రీకాంత్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మన శరీరంలోని అన్ని అవయవాల్లో మూత్రపిండాలు కూడా అత్యంత ప్రధానమైనవి. అవి పనిచేయకపోతే మన శరీరంలో అనేక అవయవాలు దెబ్బతింటాయని ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ జాడ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉండేది పిడికెడే అయినా కిడ్నీలు చేసే పనులు చాలా గొప్పవి. జీవక్రియల్లో భాగంగా పుట్టుకొచ్చే వ్యర్థాలను రక్తంలోంచి వడగట్టి, వాటిని మూత్రం రూపంలో బయటకు వెళ్లగొడతాయి అని అన్నారు. శరీరంలో ద్రవాల మోతాదులను నియంత్రిస్తాయని, సోడియం, పొటాషియం, క్యాల్షియం వంటి ఖనిజాలను సమతులంగా ఉంచుతాయని పేర్కొన్నారు. రెనిన్ వంటి హార్మోన్ల ఉత్పత్తితో రక్తపోటును అదుపు చేస్తాయని . హిమోగ్లోబిన్ సంశ్లేషణకు తోడ్పడే ఎరిత్రోపాయిటిన్ హార్మోన్ ను విడుదల చేయటం.. వీటి ఘనతే అని అన్నారు.శరీరం పరిశుభ్రంగా ఉండేలా.. సక్రమంగా, సజావుగా పనిచేసేలా చూస్తాయని మనకోసం నిరంతరం ఇంతగా శ్రమించే కిడ్నీలను కాపాడుకోవటం మన విధిగా భావించాలన్నారు. గుండె లాంటిదే కిడ్నీ కూడా, కిడ్నీల సమస్యలు రావడానికి మన జీవనశైలే ప్రధాన కారణమనేది తెలుసుకోవాలని అన్నారు. అనేక ఆరోగ్య సమస్యలు కూడా కిడ్నీలపై ప్రభావం చూపిస్తాయని, అందుకేఆరోగ్యంగా ఉంటేనే కిడ్నీలు సరిగా పనిచేస్తాయని అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌ను పాఠశాల కరస్పాండెంట్ ఎం స్వరూప, సంఘం అధ్యక్షులు గురు ప్రసాద్ తదితరులు ఘనంగా సత్కరించారు.

ఘనంగా లాబ్ టెక్నీషియన్ డే... రోగులకు పళ్ళు పంపిణీ

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా హాస్పిటల్ ప్రధాన వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీషియన్స్ సంయుక్తంగా కేక్ కట్ చేసారు. ఆస్పత్రిలో పేషెంట్ రోగులకు పళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్. ఎం. ఫణి కుమార్ మాట్లాడుతూ లేబ్ టెక్నీషియన్స్ అందరు అంకిత భావంతో పనిచేస్తూ, రోగులకు సకాలంలో రిపోర్ట్స్ ఇస్తున్నారని అభినందించారు. ల్యాబ్ లో జనరల్ పరీక్షలు తో పాటు హెచ్. ఐ. వి మరియు టీ.బీ నిర్ధారణ పరీక్షలు, చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ గుదే. రవి కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు అంతా ఆసుపత్రి లో చేసే రక్త పరీక్షలు ఉపయోగించు కోవాలని, అవసరమున్న వారికి వైద్యాదికారులు లేబ్ పరీక్ష లకు సిఫార్సు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్. జి. గోవింద్, హెడ్ నర్స్. వి. నూతన కుమారి, ఆసుపత్రి అన్ని విభాగాల వైద్యులు, వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్స్ మాధవరావు, జయలక్ష్మి, మాధవి, నారాయణ, ప్రేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సాంకేతిక సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, గురజాడలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించబడిన జాతీయ సాంకేతిక సదస్సు క్రి సెన్స్ -2 కె 25 గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా విభాగ అధిపతి డా. పి.అరుణకుమారి మాట్లాడుతూ, సదస్సుకు పాల్గొన్న ప్రతిభాశాలి విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, ఇతర విశిష్ట అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల రిజిస్ట్రార్ డా జి.జయసుమ మాట్లాడుతూ, ఇటువంటి సదస్సులు విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకునేందుకు ఉపయోగపడతాయని, విజ్ఞానాన్ని సృజనాత్మకంగా ఉపయోగించుకోవాలని కోరారు. ముఖ్య వక్తగా హాజరైన ఉప ప్రధానాచార్యులు డా. జి. జె నాగరాజు, సాంకేతిక అభివృద్ధి క్రమంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు సదస్సులో పాల్గొని కొత్త నైపుణ్యాలను అబ్బురపరిచే విధంగా అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్. డి.డి.వి. శివరాం, వి.నారాయణ రావు, విద్యార్థి సమన్వయకర్తలు ఎస్.గౌరీ చరణ్ తేజ, నల్లి ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

కురసాల కన్నబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన గండి రవికుమార్

విశాలాంధ్ర-సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు మరియు వైస్సార్సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ని ఆయన క్యాంపు కార్యాలయం నందు గురువారం పెందుర్తి నియోజకపర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ ఆయనను మార్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన పెందుర్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నిత్యం పార్టీ కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు అండగా ఉండాలని ప్రజలు తరుపున ప్రభుత్వం పై పోరాడుతూ ఉంటూ నియోజకవర్గంలో ముందుకు సాగాలని తెలియజేసారు. అయన వెంట సబ్బవరం మండలం వైస్సార్సీపీ నాయకులు యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, గండి రవికుమార్ యువ సైన్యం ఉన్నారు.

అచ్యుతాపురం వారపుసంత వేలంపాట

విశాలాంధ్ర-అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురం వారపుసంత ఆశీలు వసూలుకు గురువారం పంచాయతీ కార్యాలయంలో అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించారు. వారపుసంతకు ఆశీలు వసూలుకు గల్లా అరుణకుమారి రూ. 10 లక్షల 11 వేలకు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీరాములునాయుడు, సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు, కార్యదర్శి శైలజారాణి, వార్డు మెంబర్లు, పాటదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.